సూర్య
18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
శనివారం 19 ఏప్రిల్ 2025 | పేజీలు 8

## వాడవాడలా ఘనంగా గుడ్ ఫ్రైడే



వివరాలు లోపలి పేజీల్లో...

### విపత్తు సమయాల్లో ఫైర్ సిబ్బంది సేవలు

# అమోఘం

- ట్రెండ్ సెట్ మాల్‌లో ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహణ
- ఫైర్ విభాగంలో అవసరమైన కొత్త వాహనాలు కొనుగోలు చేశాం
- కొత్త టెక్నాలజీ ద్వారా ఫైర్ ప్రమాదాలు నివారణకు చర్యలు
- హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత



(విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్)
అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ట్రెండ్ సెట్ మాల్‌లో శుక్రవారం మాకు డ్రిల్ నిర్వహించారు.. 2







### దేశానికి క్రీడా రాజధానిగా

# అమరావతి

- మూలపాడులోనే స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం
- మౌలిక సదుపాయాల కల్పన జరిగాక ఏపీకి ఐపీఎల్ టీమ్ ఏర్పాటు
- ఎంపీ, ఏసీఏ అధ్యక్షులు కేశినేని శివనాథ్ చిన్ని

విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ : ఎన్టీఆర్ జిల్లా మూలపాడులో అమరావతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఎంపీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్ చిన్ని, శాప్ ఛైర్మన్ రవినాయుడు శుక్రవారం ప్రారంభించారు. కేశినేని శివనాథ్ బ్యాట్ పట్టగా, రవినాయుడు బౌలింగ్ చేశారు. టోర్నీని ప్రారంభిస్తూ తొలి మ్యాచ్‌లకు కేశినేని చిన్ని, రవినాయుడులు టాస్‌లు వేశారు. మిగతా 2లో

# ప్రజా సేవలో మరో ముందడుగు

### నమ్మకాన్ని పెంపొందించేందుకు గ్రామీణ ప్రాంతాలలో పల్లెనిద్ర : జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజలు శాంతియుత జీవనంలో కొనసాగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేందుకు గ్రామీణ ప్రాంతాలలో పల్లెనిద్ర చేపట్టినట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు.హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కనుమోలు పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్పీ, పోలీసు అధికారులతో కలిసి పల్లెనిద్ర చేశారు.జిల్లా ఎస్పీ స్వయంగా గ్రామాల్లో రాత్రి బస చేసి, స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వింటూ, వారితో పోలీస్ శాఖ యొక్క కార్యచరణలు, సమస్య వస్తే ఏ విధంగా సహాయం పొందాలి అనేది విపులంగా వివరించారు.ఈ సందర్భంగా ఎస్పి ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ.ప్రజలు గొడవలకు,ఘర్షణకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని, గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ, రాజకీయాలకు అతీతంగా ఉండి గ్రామాల అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు.పల్లెనిద్ర ద్వారా ప్రజలకు పోలీసుల సేవలు మరింత దగ్గరయ్యేలా చేయడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు. పోలీసుల సేవలను అందుబాటులో ఉంచుతూ, మిగతా 7లో...



# విపత్తు సమయాల్లో ఫైర్ సిబ్బంది సేవలు అమోఘం








(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్రాన్ని అగ్ని ప్రమాద రహితంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అందులో భాగంగా మాల్స్‌లో అనుకోని రీతిలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే విషయంపై ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ రోజు మాక్ డ్రిల్ నిర్వహించటం జరిగిందన్నారు. అనుకోని అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలా వ్యవహరించాలనే విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించటానికే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతుంటాయన్నారు. ఇందుకు కారణం 1944 ఏప్రిల్ 14 న ముంబాయి ఓడరేవులో అతిపెద్ద అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. అందులో 66 మంది అగ్నిమాపక సిబ్బంది చనిపోవటం, 87 మంది సిబ్బంది గాయాలపాలవటం జరిగిందన్నారు. అమరవీరుల జ్ఞాపకార్థంగా ఈ వారోత్సవాలు జరుపుకుంటున్నార న్నారు. వారం రోజులపాటు అగ్ని ప్రమాదాలపై వివిధ కార్యక్రమాలు ఫైర్ సిబ్బంది నిర్వహిస్తున్నారన్నారు. 2025కి అగ్ని సురక్షిత భారతదేశం తయారు కావాలనే ముఖ్య సందేశంతో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అగ్ని మాపక సిబ్బంది సేవలు ఎనలేనివని, ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా అగ్నిమాపక సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందు వరుసలో ఉంటూ ప్రజల ఆస్తులను, ప్రాణాలను కాపాడతారన్నారు. విజయ వాడ వరద సమయంలో 2 వేల ఇళ్లను ఫైర్ సిబ్బంది 150 ఫైర్ ఇంజన్లతో ఇళ్లను, రోడ్లను శుభ్రం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫైర్ విభాగం ఆధునికీకరణకు రూ. 250 కోట్లు కేటాయించామన్నారు. మాల్స్ సహా ఎత్తైన ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అధునాతన వాహనాలు కొనుగోలు చేశామన్నారు. జపాన్ నుంచి 3 వాహనాలు కొనుగోలు చేశామ న్నారు. అందులో విజయవాడలో రూ.10 కోట్లతో అధునాతన టర్న్ టేబుల్ వ్యాన్, వైజాగ్‌లో రూ. 20 కోట్లతో ఒక వాహనం, అదేవిధంగా తిరుపతిలో ఒక వాహనం కొనుగోలు చేశామన్నారు. ఈ వాహనాలు 55 మీటర్ల ఎత్తు వరకు తమ సేవలను అందించనున్నాయన్నారు. ఫైర్ విభాగంలో అవసరమైన 190 కొత్త వాహనాలు కొనుగోలు చేశామన్నారు. టెక్నాలజీ వినియోగించి ఫైర్ ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫైర్ విభాగంలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫైర్ స్టేషన్స్ లేని చోట కొత్త వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. మాక్ డ్రిల్ లో భాగంగా ప్రదర్శించిన సిలిండర్ ఫైర్ డెమో బాగా చూపించారన్నారు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో జరిగిన బాణా సంచా పేలుడులో ఫైర్ సిబ్బంది సేవలు అనిర్వచనీయమన్నారు. రాష్ట్రంలో పెద్ద నగరాల్లో అగ్ని ప్రమాదాలపై సేఫ్టీ ప్రికాషనరీపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగితే ప్రతి ఒక్కరూ పానిక్ అవుతారన్నారు. అలా పానిక్ కాకుండా గ్యాస్ ప్రమాదం జరిగితే ఎలా నియంత్రించాలో చాలా బాగా డెమో చేసి ఫైర్ సిబ్బంది చూపించారన్నారు. విజయవాడ వరద ప్రమాద ప్రాంతాల్లో అగ్ని మాపక సిబ్బంది బాగా సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సంచాలకులు మురళీ మోహన్, అడిషనల్ డైరెక్టర్లు జి. శ్రీనివాసులు, టి. ఉదయ్ కుమార్, రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఈ. స్వామి తదితరులు పాల్గొన్నారు.

**మాక్ డ్రిల్:** ట్రెండ్ సెట్ మాల్‌లో నిర్వహించిన మాక్ డ్రిల్ లో స్థానిక సిబ్బంది తోపాటు చాలామంది ప్రజల్లో అవగాహన కల్పించింది. ముఖ్యంగా వారు ప్రదర్శించిన గ్యాస్ ఫైర్ పై ముఖ్యంగా మహిళలు పానిక్ కాకుండా తడిబట్టను గ్యాస్ బండపై వేసి ఫైర్‌ను ఆపడం స్థానిక సిబ్బందితో చేయించారు. ఇది పలువుర్ని ఆకట్టుకుంది. మాల్స్‌లో ఫైర్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు బాగా ప్రదర్శించారు. జపాన్ నుంచి కొనుగోలు చేసిన అధునాతన టర్న్ టేబుల్ వాహనం 55 మీటర్ల ఎత్తైన మాల్స్‌లో అందించే సేవలు ప్రదర్శించారు. ఇంకా పలు ఫైర్ సేఫ్టీ విధానాలను ప్రదర్శించి ఫైర్‌ను కంట్రోల్ చేసే విధానాలు ఫైర్ సిబ్బంది ప్రదర్శించారు.





# దేశానికి క్రీడా రాజధానిగా అమరావతి

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం ఐపీఎల్ ప్రారంభమై 17సంవత్సరాలైన సందర్భంగా కేక్ కట్ చేసి జర్నలిస్టులకు, క్రీడాకారులకు తినిపించారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ అమరావతి దేశానికి క్రీడా రాజధానిగా అభివృద్ధి చెందనుందని, ఎన్టీఆర్ జిల్లా మూలపాడు ప్రాంతంలోనే స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం కూడా రానున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన జరిగాక ఏపీకి ఐపీఎల్ టీమ్ ఏర్పాటు చేస్తామన్నారు. అమరావతి లో క్రీడా యూనివర్సిటీ నెలకొల్పేందుకు చంద్రబాబు, లోకేష్ లు కృషి చేస్తున్నారని చెప్పారు. మంత్రి లోకేష్ చొరవతో అత్యుత్తమ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం అభివృద్ధి కి జైషా హామీ ఇచ్చారని తెలిపారు. ప్రతీ గ్రామంలోనూ క్రికెట్ ఉండేలా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కృషి చేస్తోందని, ఇందుకనుగుణంగా రూరల్ నియోజకవర్గాల్లో క్రీడ మైదానాలు అభివృద్ధి చేస్తామని కేశినేని శివనాథ్ చిన్ని చెప్పారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు చంద్రబాబు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారన్నారు. విజయవాడ – అమరావతి కేంద్రంగా అత్యున్నత మౌలిక సదుపాయాలు ఏర్పాటు కానున్నాయని వివరించారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం గ్రామాల్లో క్రీడల అభివృద్ధి పై శాప్ దృష్టి సారించిందని వేసవి శిక్షణ శిబిరాలకు ఈసారి ఐదు లక్షల మంది పిల్లలకు ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ప్రైమరీ పాఠశాలల దశ నుంచే విద్యార్థుల్ని క్రీడల్లో భాగస్వాముల్ని చేస్తామని, ప్రతిభ ఉన్న క్రీడాకారులు ను ప్రోత్సహిస్తామని రవినాయుడు వివరించారు. మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ అమరావతి జర్నలిస్టు క్రికెట్ లీగ్ టోర్నీకి కేశినేని ఫౌండేషన్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, శాప్ సహకారం అందించగా, కెయల్ యూనివర్సిటీ స్పాన్సర్ గా వ్యవహరిస్తుంది.

**అదరగొడుతున్న జర్నలిస్టులు...**

**తొలిరోజు ఫలితాలు ఇలా..**

మూలపాడులోని ఏసిఏ స్టేడియం లో ఉదయం ఎ గ్రౌండ్ లో జరిగిన తొలి మ్యాచ్ లో విజయవాడ మీడియా టీం... ఐ అండ్ పిఆర్ టీం పై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఐ అండ్ పి.ఆర్ టీం 89 పరుగులకు ఆలౌట్ కాగా, విజయవాడ మీడియా జట్టు 11.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసి విజయం సాధించింది. బి గ్రౌండ్ లో సచివాలయం ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ టీవీ జట్టు మధ్య జరిగిన మ్యాచ్ లో కేబుల్ టివి టీం గెలుపొందింది. మధ్యాహ్నం ఎ గ్రౌండ్ లో జరిగిన మ్యాచ్ లో సచివాలయం ప్రింట్ మీడియా జట్టు పై అమరావతి మీడియా జట్టు విజయం సాధించింది. బి గ్రౌండ్ లో మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్ లో సచివాలయం కెమెరామెన్ జట్టు పై రాజధాని మీడియా జట్టు పై అన్ని విభాగాల్లో చేయి సాధించి 105 పరుగులు తేడాతో ఘన విజయం సాధించింది. శనివారం సెమీ ఫైనల్స్, ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది.







## సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

**గన్నవరం (ఉంగుటూరు), ఏప్రిల్ 18, మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండలం పొణుకుమాడు గ్రామంలో రూ.75 లక్షల తో సీసీరోడ్లు, పెద్ద అవుటపల్లిలో రూ. 80లక్షలతో నూతనంగా నిర్మించిన 4 సిసి రోడ్లను శుక్రవారం రాత్రి ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం యార్లగడ్డ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి దూరమైన రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఈ 10 నెలల కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమా లు చేపట్టిన సంగతి గుర్తు చేశారు. నిధుల కొరతతో అల్లాడుతున్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టి రాజధాని నిర్మాణంతోపాటు పారిశ్రామిక అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఘనత సీఎంచంద్రబాబుకే దక్కిందన్నారు. గన్నవరంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఇప్పటికే జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. గన్నవరాన్ని పారి శ్రామికంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలు ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని మల్లవల్లి పారిశ్రామికవాడలో పూర్తిస్థాయి పరిశ్రమలు ఏర్పాటు అయితే సు మారు 30 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. గుడ్ ఫ్రైడే పుర స్కరించుకొని పెద్దావుటపల్లి గ్రామంలోని జోసఫ్ తంబి ఆలయానికి చేరుకున్న వెంకట్రావ్ తంబీ సమాధిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సెక్రటరీ ఆళ్ళ హనుక పెద్ద అవుటపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు మున్న రామ కృష్ణ, వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

# సర్వమానవాళిని పాపవిముక్తులను చేసిన యేసుక్రీస్తు సిలువ త్యాగం

## గుడ్లవల్లేరులో అత్యంత భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ఆరాధనలు

### సిలువ మార్గాలు, సిలువ ధ్యానాలతో దైవజనుల, విశ్వాసుల ప్రత్యేక ప్రార్థనలు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలంలో కుల మతాలకు అతీతంగా క్రైస్తవులు, క్రైస్తవేతరులు "గుడ్ ఫ్రైడే" ఆరాధన లను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలవరకు క్రైస్తవ ఆలయాల్లో క్రీస్తు భక్తులు ప్రత్యేక ప్రార్థనలు జరిపి, క్రీస్తు సిలువ శ్రమలను, సిలువపై పలికిన మాటలను ధ్యానించారు. గుడ్ ఫ్రైడే ఆరాధనల్లో భాగంగా ఆర్సియం దేవాలయ ఫాదర్ రెవ. మాథ్యూ ఆధ్వర్యంలో 40 దినాల తపస్సుకాలదీక్షలో వున్న వందలాది మంది క్రీస్తు సిలువ మార్గాన్ని గుడ్లవల్లేరు పురవీధుల్లో నిర్వహించారు. విచారణలోని ఆలయాల్లో ఉపదేశులు ఆంద్రెయ, జయబాబు, ఫ్రాన్సిస్, జోజి, జయరాజు, సునీల్ తదితరులు ప్రర్లనలు నిర్వహించారు. అలాగే గుడ్లవల్లేరు సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ రెవ. జంగం సుధీర్ నేతృత్వంలో 300 మంది విశ్వాసులతో సిలువ శ్రమల ధ్యానంచేసి, ప్రార్థనలు జరిపారు. అలాగే డోకిపర్రు బెత్లెహేం మినిస్ట్రీస్ రెవ.వీర్ల ఆనందరావు సారథ్యంలో డోకిపర్రు, కౌతరం, కూరాడ ఆలయాల్లో ప్రత్యేక ప్రార్మనలు జరిపారు. అలాగే గుడ్లవల్లేరు గాడ్స్ హౌస్(సిబిఎం చర్చ్)లో క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటల పరమార్థంను పాస్టర్ పి.సురేష్, విశ్వాసులు ధ్యానం చేసారు. కూరాడ లాకుదిగువ ఆలయంలో బిషప్ జాన్ బెన్నీ లింగం విశ్వాసులు ప్రార్థనలు జరిపి దేవుడిని ఆరాధించారు. కూరాడలో పాస్టర్ పులి జీవన్, విన్నకోటలో పాస్టర్ జయరాజు, డోకిపర్రులో పాస్టర్ ఆశీర్వాదం, పాస్టర్.రాజారావు, అంగలూరులో రెవ.ఆదరణ కుమార్, గుడ్లవల్లేరులో పాస్టర్ కోటే సామ్యూల్ బాబు, పెనుమాయేలు





మందిరంలో పాస్టర్. కంభం ప్రభుదాసు ప్రార్థనలు జరిపారు. ఈసందర్భంగా చిత్రం, శేరీదగ్గుమిల్లి బాప్టిస్ట్ ఆలయాలలో జరిగిన శుభ శుక్రవారం ఆరాధనల్లో సిబిఎం దైవజనులు డాక్టర్ గోట్రు ప్రకాశం సిలువ శ్రమల ధ్యాన సందేశమిస్తూ "తండ్రీ, వారిని క్షమించు, ఎందుకంటే వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు" అంటూ (లూకా 23:24)లో యేసు ప్రభువు తండ్రికి చేసిన ప్రార్థన తన కోసం, తన స్నేహితులు, తనను ప్రేమించేవారు, తనతో నడిచినవారి కోసం కాదని, ఈ ప్రార్థన తనను ఎక్కువగా బాధించిన వారి కోసం, ఆయనపై కొరడాతో కొట్టిన, ఆయనపై ఉమ్మివేసిన, ఆయనను సిలువకు మేకులు కొట్టిన, ఆయన తలపై ముళ్ల కిరీటం పెట్టిన, ఆయనను ఎగతాళి చేసినవారి కోసం, ఆయన సిలువపై వేలాడదీసి, ఆయన వస్త్రం కోసం చీట్లు వేసి, ఆయనను అవమానించిన వారి కోసం ప్రార్థించాడని, తనను తృణీకరించిన, తనపట్ల అవిధేయులుగా జీవించిన అందరి కోసం యేసు క్షమాపణ కోరాడన్నారు. అలాగే గుడ్ ఫ్రైడే ఆత్మపరిశీలనకు పిలుపునిస్తుందని, ఆత్మపరిశీలన చేసుకునే ప్రతి ఒక్కరూ పాపులని గ్రహిస్తారని, పాపులు దేవుని క్షమాపణ కు అర్హులు కాదని, కానీ యేసు సర్వ మానవాళి పాపవిముక్తికి సిలువలో ప్రాణత్యాగం చేసి రక్షణ ప్రసాదించాడని, అలాంటి యేసుక్రీస్తు ప్రేమను, క్షమాగుణాన్ని కలిగి ఆయనను వెంబడించాలంటూ క్రైస్తవ లోకానికి, సర్వ మానవాళికి డాక్టర్ ప్రకాశం పిలుపునిచ్చారు.



## గుడ్ ఫ్రైడే వేడుకలలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



**పామర్రు ఏప్రిల్ 18 మేజర్ న్యూస్:** పామర్రు మండలంలోని వివిధ గ్రామాలలో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా క్రైస్తవులు గ్రామంలో సిలువను పట్టుకుని



ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు కీర్తనలు ఆలపిస్తూ గ్రామాల్లో నిర్వహించిన ర్యాలీలు పలువురిని ఆకట్టుకున్నాయి. పామర్రు టౌన్ ఆర్.సి.యం చర్చిలో నిర్వహించిన "పరిశుద్ధ సిలువ మార్గం" అనే కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా శిలువకు నమస్కరించి అనంతరం శిలువను కొద్దిసేపు మోసారు. అనంతరం అక్కడకు విచ్చేసిన క్రైస్తవులకు మజ్జిగ పంపిణీ చేసి కొద్దిసేపు అక్కడి వారితో ముచ్చటిస్తూ గడిపారు.

## కోడూరు మండలంలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**కోడూరు మేజర్ న్యూస్:** కోడూరు ఆర్ సియం, ఫాదర్ సిహెచ్ ప్రశాంత్, ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కోడూరు శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అవనిగడ్డలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

### శిలువను మోసిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి, యువనేత మండలి







**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** క్రైస్తవులు అత్యంత పర్వదినంగా చేసుకునే పండుగల్లో గుడ్‌ఫ్రైడే ప్రధానమైనది. ఈ పండుగ సందర్భంగా అవనిగడ్డ లోని అన్ని ప్రార్థనా మందిరాల్లో ఏసుప్రభువును స్మరించుకుంటూ శిలువ మార్గాన్ని అనుసరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు, అవనిగడ్డ ఆర్ సి ఎం చర్చి ఫాదర్ జి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిలువ యాత్రలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొని ఏసుప్రభు కీర్తనలను ఆలపించారు. ప్రధాన వీధులలో శిలువను మోస్తూ ప్రార్థనలు చేశారు. సిలువ మార్గంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, యువ నేత మండలి వెంకట్రాంలు శిలువను భుజాన పెట్టుకుని క్రైస్తవ సోదరులకు సంఘీభావం తెలుపుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని పలు ప్రార్థన మందిరాలు, చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా చేసుకున్నారు. అనంతరం క్రైస్తవ సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# గుడ్ ఫ్రైడే సందర్భంగా భక్తి శ్రద్దలతో ప్రార్థనలు







**నందిగామ, ఏప్రిల్ 18, మేజర్ న్యూస్:** మండలంలో ఏసుక్రీస్తు సిలువ వేసిన పవిత్ర దినమైన గుడ్ ఫ్రైడే ను భక్తిశ్రద్ధలతో శ్రమ దిన దిక్షాదారులు క్రీస్తు సోదరులు ఘనంగా నిర్వహించారు. రాఘవపురం రామ్ రెడ్డి పల్లి కమ్మవారిపాలెం సిలువ గిరి గ్రామాలలోని పరిశుద్ధ దేవాలయం,ఆర్ సి యం, సిఎస్ఐ చర్చిలో ప్రార్థనా మందిరాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, సిలువ గిరి రెవరెండ్ ఫాదర్ ఫెలోమెన్ రాజు, వేలంగిణీమాత చర్చ్ రెవరెండ్ ఫాదర్ డి విజయరాజు, డిబిహెచ్ చర్చి రెవరెండ్ ఫాదర్ జోజిరెడ్డి, పలు చర్చి ఫాదర్స్ తేజ పవన్ బ్రదర్స్‌ల ఆధ్వర్యంలో జరిగిన క్రీస్తు సిలువ మార్గం వేడుకలు భక్తిశ్రద్ధలతో క్రీస్తు సంఘాల భక్తులు శ్రమ దినదిక్షాదారులు నిర్వహించారు. ఆయా గ్రామాలలో 14 కూడలి వద్ద క్రీస్తు త్యాగాన్ని స్మరిస్తూ మానవాళికి శాంతి చేకూర్చేందుకు క్రీస్తు సిలువ మార్గం పై భక్తులకు దేవదూతగా అవతరించి మానవాళిని ఉద్ధరించరని క్రీస్తు సందేశాన్ని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల క్రీస్తు సంఘాల సభ్యులు భక్తులు శ్రమ దినదిక్షాదారులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు మా త్యాగానికి గుర్తే గుడ్ ఫ్రైడే....

## ఫాదర్ కామ క్రీస్తు రాజు



**పెనుగంచిప్రోలు మేజర్ న్యూస్ :** పెనుగంచిప్రోలు మండలం లోని క్రై స్తవ సోదరి,సోదరులు"గుడ్ ఫ్రై డే " సందర్భంగా సిలువ మార్గం ను పెనుగంచిప్రోలు పడమర బజారు ఆర్ సి ఎం చర్చి వద్ద నుండి తూర్పు బజారు ఆర్ సి ఎం చర్చి మీదుగా ముచ్చింతాల ఆర్ సి ఎం చర్చి వరకు ర్యాలీగా సిలువ మార్గం శు క్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముచ్చింతాల విచారణ గురువు పాధర్ కామ, క్రీస్తు రాజు ఆధ్వర్యంలో ఈ సిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా పాధర్ మాట్లాడుతూ ఇతరులకోసం జీవించే జన్మ చరితా ర్ధమని నిరూపించిన క్రీస్తు చరిత్ర నుగుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలని, లోకానికి శాంతి దూతగా వచ్చిన ఏసు క్రీస్తు కు కల్వరి గిరిపై సిలువ వేసిన శుక్రవారం రోజును "గుడ్ ఫ్రైడే "గా నిర్వహింస్తాం, శరీరం లోకి మేకులు దించిన సమయంలో కూడ ఆ దేవదూత శాంతినే ప్రభోదించాడు, అందుకే ఆయన చూపిన మార్గం అనుసరణీయం, ఈ స్టర్ ఆదివారానికి ముందు వచ్చే శు క్రవారం రోజున జరుపుకునే ఈ పవిత్ర దినం రోజు ఉపవాసం ఉండి ఆయనకు నివాళి అర్పించడం క్రైస్తవ సోదరులు పాటించే ఆచారం, క్రీస్తుత్యాగని స్మరించు కుంటూ, ఆయన బోధనలుపాటిస్తూ, సర్వమానవ సమానత్వన్ని, శాంతిని నెలకొల్పేం దుకు కృషి చేద్దాం అన్ని జనావాళికి సందేశం ఇచ్చారు. ప్రపంచానికి ప్రేమ తత్వం బోధించి న దయామయు డు, సిలువపై యేసుక్రీస్తు త్యాగం మహోన్నతమైనదని "గుడ్ ఫ్రైడే" సందేశంలో పేర్కొన్నారు, కరుణామయుడి జీవితం మానవాళికీ అందించిన సందేశ మని, ప్రభు యేసుక్రీస్తు త్యాగాన్ని స్మరిస్తూ క్రైస్తవ సోదర సోదరీ మణులకు ఆధ్యా త్మిక శాంతి కలగాలని ప్రార్ధించారు. యేసుక్రీస్తు సిలువ మోస్తున్న వేషా ధారణ, రాజ బటులు వేషాధారణలు ప్రజలు గుండెల్లో ఆకట్టు కున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపదేశీలు (పంతుల్లు) కోలాకాని అర్జున రావు, తుమ్మల మహేష్, పిడతల యేసు బాబు. సంఘ పెద్దలు పంద్రకోల శ్రీనివాసరరావు, గుజర్లపూడి ఉదయ బాబు, దమ్మాలపాటి అశోక్, గుజర్ల పూడి వడ్డీ కాసులు, గేరా, జార్జీ, గుర్రం, వినోద్ చింతల, ఏలియ్య క్రైస్తవ సోదర, సోదరీ మణులు తదితరులు పాల్గొన్నారు.

# పెదపారుపూడిలో గుడ్ ఫ్రైడే



**పెదపారుపూడి ఏప్రిల్ 18 మేజర్ న్యూస్ :** పెదపా రుపూడి మండల పరిధిలోని పలు గ్రామాలలో శు క్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని పెదపారుపూడి, వెంట్రప్రగడ, భూషణగుళ్ళ, వానపాముల, చినపారుపూడి, ఈదులమద్దాలి, యలమర్రు తదితర గ్రామాల్లోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెదపారుపూడిలో రక్షణ సైన్యం దేవాలయంలో మేజర్ వి. విజయ్ కుమార్, మేజర్ రూతు కుమారి ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమాలలో సంఘ పెద్దలు దగాని జోసెఫ్, నత్తా భూషణ కుమార్, గూడపాటి భాస్కరరావు, గృహ సహిత సభ్యులు పీక పద్మ, గుమ్మడి ఏసు మరియమ్మ, దగాని గ్రేస్ తదితరులు పాల్గొని క్రీస్తు శిలువ మీద చెప్పిన ఏడు మాటలను ఈ సందర్భంగా క్రైస్తవ భక్తులకు వివరించారు.

# హద్దులు లేని ప్రేమకు నిర్వచనం ఈ శిలువ మరణం







**కృత్తివెన్ను ఏప్రిల్ 18 మేజర్ న్యూస్ :** హద్దులు లేని ప్రేమకు నిర్వచనమే ఈ సిలువ మరణం అని రెవరెండ్ బీవి డానియల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ సోదరులు మండల వ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుంచి ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను ధ్యానిస్తూ ప్రత్యేక వాక్య సందేశాలను అందించారు. లోక విమోచన కొరకు ఏసుక్రీస్తు శిలువ మరణం జరిగిందని పేర్కొన్నారు. పాపంలో, అంధకారంలో మగ్గిపోతున్న ప్రజలను సత్యం మార్గం జీవం తానై ముందుకు నడిపించేందుకు ఏసుక్రీస్తు ఈ లోకంలో జన్మించారని తెలిపారు. క్రీస్తు చూపిన ప్రేమ దయా గుణం జాలి కరుణ ప్రతి ఒక్కరు తమ పొరుగువారి పట్ల చూపిస్తే ఈ ప్రపంచంలో ఎటువంటి యుద్ధాలు, గొడవలు జరగవు అని పేర్కొన్నారు. క్రైస్తవ మతం అనేది ప్రజలను మోక్షం వైపు నడిపించే మార్గం గా వారు వివరించారు. ప్రతి ఒక్కరు క్రీస్తు బోధలను అనుసరిస్తూ పవిత్రంగా జీవించాలని అప్పుడే క్రీస్తు మరణించిన దానికి అర్థం ఉంటుందని అన్నారు. లక్ష్మీపురం ఆర్సిఎం ఫాదర్ ఆధ్వర్యంలో 216 జాతీయ రహదారిపై సిలువ మార్గాన్ని చేపట్టారు. అలనాడు యేసు క్రీస్తును ఎలా సిలువ వేశారు వివిధ వేషధారణ,అలంకరణలతో ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. జాతీయ రహదారిపై సిలువను మోస్తూ తమ ప్రభువైన ఏసుక్రీస్తు పై తమ భక్తిని చాటుకున్నారు. కొమల్లపూడి ప్యారిష్ పాస్టర్ స్పర్జన్ కుమార్ ఆధ్వర్యంలో పలు దేవాలయాలలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. 40 దినాల నుంచి ఉపవాస దీక్షలో ఉన్న క్రైస్తవులు తమ దీక్షలను నేటితో విరమిస్తారు. క్రైస్తవులకు అత్యంత ప్రత్యేకమైన దినంగా గుడ్ ఫ్రైడే పాటిస్తారని ఎంతో భక్తిశ్రద్ధలతో 40 దినాలు ఉపవాసం ఉండి ప్రత్యేక ఆరా ధనలు ప్రార్థనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రార్థన మందిరాలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా సిలువ ధ్యాన ప్రార్థనలు నిర్వహిం చారు గుడ్ ఫ్రైడే ప్రార్థనలో పాల్గొని ప్రత్యేక గీతాలు ప్రార్థనలు నిర్వహిం చారు. కొమల్లపూడి ప్యారిస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఆదేశ గురువారం ఆరాధనను సీతనపల్లి సిఎస్ఐ దేవాలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ స్పర్జన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఆరాధన కార్యక్రమం నిర్వహించగా పాస్టర్ ఎఫ్రాప్రా దైవ సందేశాన్ని అందించారు. డీనరీ చైర్మన్ రెవరెండ్ జాషువా క్రీస్తు సిలువ ధ్యానాల గురించి వివరించారు. జడ్పిటిసి మైల రత్నకుమారి ప్రత్యేక గీతాలు ఆలపించారు. ప్యారిస్‌లోనే నాలుగు సంఘాల పెద్దలు సంఘ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.





## సిలువ మార్గంలో వందలాదిమంది విశ్వాసులు

**చల్లపల్లి మేజర్ న్యూస్:** చల్లపల్లి సాలిపేట ఆర్.సి.యం చర్చి ఆధ్వర్యంలో శుభ శుక్రవారం(గుడ్ ఫ్రైడే) సందర్భంగా దివిసీమలోని 12 గ్రామాల ఉపదేశికులు,వి శ్వాసులు వందలాదిమంది శిలువ మార్గంలో అనుసరించి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. చల్లపల్లి సాలిపేట ఆర్సీఎం చర్చి ఫాదర్ బి.రవికుమార్ ఆధ్వర్యంలో క్రీస్తు శాంతి సందేశాలను అందజేశారు. స్థానిక కోమలానగర్ సమీపంలోని మదర్ తెరిసా స్కూల్ నుంచి వందలాది మంది విశ్వాసులు సిలువ మార్గంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు మదర్ తెరిసా స్కూల్ ప్రతినిధి ఆంధ్రూ గ్రోమ్స్ ఆధ్వర్యంలో విశ్వాసులకు అల్పా హారం, మజ్జిగ,తాగునీరు పంపిణీ చేశారు. అలాగే బిఎస్ఎన్ఎల్ విశ్రాంతి ఉద్యోగి తోట బెర్నార్డు షా ఆధ్వర్యంలో విశ్వాసులకు మజ్జిగను పంపిణీ చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరియదళ సభ్యులు ప్రార్థనా గీతాలను ఆలపించారు. సత్ప్రసాదం పంపిణీ జరిగింది.

## గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు - భారీ ర్యాలీ



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు మండలంలోని 22 గ్రామపం చాయతీలో క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే ను భక్తిశ్రద్ధలతో ఘనంగా చర్చి లలో ప్రార్థన జరుపూకున్నారు. ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు



మాటలను గురించి సంఘ కాపరులు, గురువులు, బోధకులు చర్చిలలో విపులంగా వివరించి ఉన్నారు. రోమన్ ప్రభుత్వం ఏసుక్రీస్తు చేసే అద్భుత క్రియలు, బోధనలు నచ్చక ఆయనను యే రుషలేములో సిలువ వేస్తారని క్రైస్తవుల విశ్వాసం. దీనిని పురస్కరించుకొని క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలలో ప్రార్థన నిర్వహిస్తారు. ఏసుక్రీస్తు ప్రజల కోసమే మర ణించాడని ఆయన చూపిన క్షమాగుణం, దయ కరుణ, జాలి మార్గాలలో ప్రజలు జీవించాలని, అలాగే తదితరువి పాటించి ఇతరులకు సేవ చేయాలని జి కొండూరు సిఎస్ఐ పాస్టర్ యం.జాన్ కోటేశ్వరావు వివరించారు.అలాగే స్థానిక ఆర్సిఎం చర్చిలో ఫాదర్ మేడేపల్లి థామస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సండే స్కూల్ విద్యార్థులు ఏసుక్రీస్తు శిలువలోపరిచిన ఏడు మాటలు వివరించారు.

## పమిడిముక్కలలో వైభవంగా శిలువ యాత్ర



**పమిడిముక్కల ఏప్రిల్ 18 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలంలో రెవరెండ్ రాజారత్నం ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో శిలువ యాత్ర నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెద్దసం ఖ్యలో క్రైస్తవులు పాల్గొని క్రీస్తు ప్రార్థన గీతాలను ఆలపిం చారు. శాంతియుత సమాజం కోసం సన్మార్గ జీవనాన్ని మానవ ప్రపంచానికి చాటి చెప్పిన యేసుక్రీస్తు శిలువను ఎక్కి తన రక్తాన్ని చిందించిన రోజును క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరు మననం చేసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు క్రైస్తవ బోధకులు పేర్కొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన విక్కుర్తి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక ఏ కన్వెన్షన్ సెంటర్లో జరుగుతున్న రచన లోకేష్ల వివాహానికి ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అవనిగడ్డకు చెందిన ఉపాధ్యాయుడు దేవనబోయిన ఉమామహేశ్వర రావు, ఆండాళ్ళు దంపతుల కుమార్తె రచన, విజయవాడకు చెందిన అనుముకొండ హరి వెంకట సురేష్, జ్యోతి దంపతుల కుమారుడు లోకేష్ల వివాహం శుక్రవారం ఉదయం జరిగింది. వివాహానికి హాజరైన విక్కుర్తి, నూతన వధూవరులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, రేపల్లె ముసయ్య, భూపతి నాంచారయ్య, బర్మా బుజ్జి, రేపల్లె ఈశ్వరరావు, బర్మా శ్రీనివాసరావు లతో పాటు వధూవరుల కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** విభిన్న రంగాల్లో విద్యార్థుల్లో నిగూఢంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కోడూరు బాలోత్సవ్ నిర్వాహకులను ఎమ్మెల్యే ఘన సన్మానించారు. ఇటీవల కోడూరులో మండల విద్యా కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన బాలోత్సవ్ వేడుకల్లో అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలకు అహర్నిశలు శ్రమించి విజయవంతం చేసిన కోడూరు మండల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను మొత్తం 42మందిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. కోడూరు బాలోత్సవ్ స్ఫూర్తితో నియోజకవర్గ స్థాయి బాలోత్సవ్ నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గయువనాయకులు మండలి, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయినవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఏఎంసీ చైర్మన్ కొల్లూరిని సన్మానించిన జనసేన నేతలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్గా ఎన్నికైన కొల్లూరి వెంకటేశ్వరరావును జనసేన పార్టీ సీనియర్ నాయకులు సిద్దినేని అశోక్, కమతం నరేష్ ఘనంగా సత్కరించారు. స్థానిక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అణచివేత వైఖరిని ఎదుర్కొని, అక్రమాలను అడుగడుగునా ప్రశ్నిస్తూ, పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించిన కొల్లూరి వెంకటేశ్వరరావు కి చైర్మన్ పదవి వరించడం ఆయన కష్టానికి తగ్గ ప్రతిఫలమే అని అశోక్ అన్నారు. సన్మాన కార్యక్రమంలో మానేపల్లి సత్యన్నారాయణ, బూరగడ్డ చంటి తదితరులు పాల్గొన్నారు.

## పులిగడ్డలో 47 బోట్లకు ఇమ్యురేషన్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ పల్లెపాలెంలో వేట నిషేధ భృతికి సంబంధించి శుక్రవారం ఇమ్యురేషన్ నిర్వహించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు మత్స్యకార భరోసా ప్రభుత్వం ఇవ్వనున్నది. ఈ సందర్భంగా పులిగడ్డలో 47 బోట్లను ఇమ్యురేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు ఇమ్యురేషన్ అధికారిగా కంకిపాడు ఎఫ్ డి ఓ అఖిల అవనిగడ్డ ఫిషరీస్ అసిస్టెంట్ పి రమ్య దీప్తి సాగర్ మిత్ర మురళి సొసైటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కళాకారులను ప్రోత్సహించాలి

### ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో కళాకారులకు సన్మానం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** కళాకారులను గౌరవించి ప్రోత్సహించటం అందరి బాధ్యత అని ఎన్టీఆర్ కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని అన్నారు. స్థానిక ఎన్టీఆర్ పార్కులోని కళావేదికకు అనుసంధానంగా కళాకారుల సౌకర్యార్థం కళాపరిషత్ అధ్యక్షుడు బోలెం రామారావు నాగమణి దంపతులు సుమారు రూ. మూడు లక్షల వ్యయంతో నిర్మించిన మేకప్ రూమ్ను ఉపసర్పంచ్ ముమ్మనేని నాని – మల్లీశ్వరి దంపతులు, ప్రముఖులు నర్రా సాయిబాబు, ఆకుల స్వభూప్రసాద్ కలిసి శుక్రవారం ప్రారంభించారు.

**కళాకారులకు ఘన సన్మానం**

ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు, ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావు, పౌరాణికమేటి పుప్పాల వీరాంజనేయులు ఇటీవల బంగారునంది అవార్డులు స్వీకరించిన వారికి ముమ్మనేని నాని ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. పలువురు పురప్రముకులు రామారావును సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం కళాపరిషత్ ఆధ్వర్యంలో రంగస్థల కళాకారులు బెల్లంకొండ ఏడుకొండలు, వేముల సూరిబాబు, రాజులపాటి వీరాచారి, సుబ్బయ్య, మల్లంపల్లి రాంబాబు, హార్మోని.. వయోలనిస్టు డి.రమేష్, శర్మ, శ్రీరాం పూర్ణచంద్రరావు, సత్యనారాయణ, నారేపాలెం వేణు, కోలాటం గురువు వేముల అంకంబొట్లు, డప్పు కళాకారుడు చాట్రగడ్డ శ్రీనివాసుడు తదితర కళాకారులను పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మాలెంపాటి శ్రీనివాసరావు, పైడిపాముల స్వప్న, ప్రముకులు అడ్డాడ ప్రసాద్ బాబు యార్లగడ్డ శ్రీనివాసరావు, దాసి సీతారామరాజు, పివి. మాధవేంద్రరావు, మీర్ రిజ్వాన్, కైతేపల్లి దాస్, ఉప్పల సాంబశివరావు, పరిశె మౌళి, బుల్లా కిషోర్, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, కస్తూరి ప్రసాద్, గొర్రెపాటి పిచ్చేశ్వరరావు, బత్తుల ప్రసాద్, రావులపల్లి పండు, పోతుమర్తి నాగమణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాప్రదర్శనలు జరిగాయి. పౌరాణిక కళాకారులు పలు పద్యాలను, ఏకపాత్రాభినయంలోని సన్నివేశాలను ఆలపించారు.



## ఎస్సీ వర్గీకరణతో కూటమి ఉప కులాలకు మేలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఎస్సీ వర్గీక రణతో కూటమి ప్రభుత్వం ఉప కులాలకు మేలు చేసిందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, అవనిగడ్డ ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణ సాకారం అయిన సందర్భంగా స్థానిక నేరెళ్లపాలెం బస్టాప్ వద్ద అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ఎస్సీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు గతంలోను ఎస్సీల్లో మేలు చేసేలా వర్గీకరణ అమలు చేశారన్నారు. తాజా డీఎస్సీలోనూ వర్గీకరణ ఫలాలు ఎస్సీ ఉప కులాలకు అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ద వహించి ఎస్సీ వర్గీకరణ చేసిన సందర్భంగా పీఎం నరేంద్రమోడీ, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## నందిగామలో ఘోర రోడ్డు ప్రమాదం

### గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి



**నందిగామ, ఏప్రిల్ 18, మేజర్ న్యూస్ :** పట్టణ శివారు అనాసాగరం హైవే పై నడుచుకుంటూ వెళుతున్న ఇద్దరు వ్యక్తులను గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అక్కడికక్కడే ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మృతులు జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామానికి చెందిన పసుమర్తి భాస్కరరావు రుద్రపోగు వెంకటేశ్వర్లుగా సమాచారం అందించారు. గురువారం రాత్రి వేదాద్రి గ్రామం నుండి యేసుక్రీస్తు మాలదరించి గుణదల మేరీ మాత చర్చికి కాలిబాటన బయలుదేరారు. గత రాత్రి అనాసాగరం ఫ్లైఓవర్ వద్దకు గాలి బాటన వస్తున్న వీరిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి ఆగకుండా వెళ్ళినట్లుగా సమాచారం,ఘటనా స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని నందిగామ మార్చురీకి తరలించారు.

## నేడు గుడ్లవల్లేరులో లయన్స్ నేత్ర వైద్య శిబిరం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ఏప్రియల్ 19 శనివారం ఉదయం 10 గంటలకు గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్లో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం నిర్వహించబడునని లయన్స్ అధ్యక్షురాలు ఎన్.శశికళ తెలిపారు. ఈ నేత్ర వైద్య చికిత్స శిబిరాన్ని గుడ్లవల్లేరు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శశికళ కోరారు. లయన్స్ కార్యదర్శి ఎమ.పెరుమాళ్ళు, కోశాధికారి కె.నవాబు, లయన్ ప్రముఖులు సూరపనేని పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీజేని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జి.గోపిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు. జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జి.గోపిని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు న్యాయమూర్తి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం అందించే దిశగా న్యాయవ్యవస్థ, భద్రతా వ్యవస్థ లు పరస్పర సహకారంతో సమర్థవంతంగా పని చేయాలని ఇరువురు ఆకాంక్షించారు. న్యాయశాఖకు పోలీసుశాఖకు ఉన్న సంబంధ బాంధవ్యాలు మరింతగా మెరుగుపడేలా కృషి చేస్తామన్నారు. నేరం చేసిన వారికి త్వరితగతిన శిక్ష పడేలా పూర్తి సహాయసహకారాలు కావాలని, బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేలా పోలీసు శాఖ తరపున కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. ఎస్పీ తో పాటు బందరు డిఎస్పి సిహెచ్ రాజా, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, చిలకలపూడి ఇన్స్పెక్టర్ అబ్దుల్ నబీ జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉల్లాస్ -2 కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**పమిడిముక్కల ఏప్రిల్ 18 మేజర్ న్యూస్ :** వయోజన విద్యా కార్యక్రమంలో భాగంగా త్వరలో ప్రారంభం కానున్న ఉల్లాస్ 2 కార్యక్రమానికి సంబంధించి గ్రామాలలో వెంటనే సర్వే ప్రారంభించాలని ఎండిఓ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించి మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల 4వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఉల్లాస్..2 కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. నిరక్షరాస్యులు అయిన వయోజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమం లో భాగంగా నిర్వహిస్తున్న ఉల్లాస పథకాన్ని అమలు చేసేందుకు గాను గ్రామాలలో నిరక్ష్యరాస్యులను గుర్తించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి -2 శ్రీనివాసరావు, ఎపిఎం దేవరకొండ వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ సూపర్ వైజర్ మన్నెం ఝాన్సీ లతోపాటు వెలుగు సీసీలు హాజరయ్యారు.

# మహోన్నత సేవామూర్తి మణి ప్రభాకరరావు



**చల్లపల్లి మేజర్ న్యూస్:** మహోన్నత సేవామూర్తి మణి ప్రభాకరరావు అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి మండలం వక్క లగడ్డ గ్రామంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కే.మణి ప్రభా కరరావు ఇటీవల మృతి చెందగా శుక్రవారం ఎమ్మెల్యే వారి స్వగృహంలో మణి ప్రభాకరరావు చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుని స్థాయిలో ఉత్తమ విద్యా బోధన అందించిన మణి ప్రభాకరరావు, సమాజంలోని నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తిం చి వారికి ఫీజులు క్రమం తప్పకుండా చెల్లిస్తూ ప్రోత్సహించి ఉన్నత స్థాయికి చేరుకునే వరకు సంపూర్ణ సహకారం అందించారని స్మరించుకు న్నారు. దాదాపు 150 మంది విద్యార్థులు మణి ప్రభాకరరావు సహకారంతో ఉత్తమ విద్యావంతులుగా ఎదిగార న్నారు. లయన్స్ క్లబ్ ద్వారా విస్తృత సమాజసేవ చేయడంతో పాటు, స్పోర్ట్స్ పోటీలకు విశేష సహకారం అందించే వారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా ఉత్తమ సేవలు అందించారని స్మరించుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మల్లిపెద్ది అజయ్ బాబు, టీడీపీ నాయకులు పరిశే మౌళి, విశ్రాంత ఈఓఆర్డి దాసి సీతారామరాజు, మణి ప్రభాకర్ బంధుమిత్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.





## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**పామర్రు ఏప్రిల్ 18 మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మ రణం పాలైన సంఘటన పామర్రు - గుడివాడ జాతీయ రహదారిపై శు క్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం పామర్రు బాపూజీ పేటకు చెందిన ఆరేపల్లి శ్రీనివాసరావు(58) పామర్రు నుండి యాక్టివా స్కూటర్ పై గుడివాడ వెళుతుండగా ప్రమాదవశాత్తు అడ్డాడ సమీపంలో స్కూటర్ డివైడర్‌కు తగిలింది. దీంతో స్కూటర్ నడుపుతున్న వెంకటేశ్వర రావు పక్కకు పడిపోగా తలకు తీవ్రమైన గాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందిన వెంటనే పామర్రు పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పామర్రు ఎస్సై రాజేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



## విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని ఎదగాలి

### అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**చల్లపల్లి మేజర్ న్యూస్:** విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని ఎదగాలని అవని గడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన ఐ.ఎన్.టీ.ఎస్.ఓ పరీక్షలో చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ రామానగరం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు లాప్ టాప్, ట్యాబ్, స్మార్ట్ వాచెస్, హెడ్ సెట్, స్కై బ్యాగ్స్ గెలుపొందారు. ఈ సందర్భంగా విజేతలకు శుక్రవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. ఈ పోటీలో సిద్దెల శామ్యూల్ రాజ్, వేము లపల్లి యువన్ కార్తికేయ ట్యాబ్, గణపరెడ్డి వేద వైష్ణవి ట్యాబ్ అందుకున్నారు. మత్తి తీక్షిత, గరికపాటి రఘురాం, కొల్లిపర అక్షర, మార్పుల సూరజ్ కుమార్, మార్పుల సూర్య కిరణ్ రెడ్డి, మేకల యశస్వి పవన్ కుమార్, డొక్కు నవనీత్ కృష్ణ స్మార్ట్ వాచెస్, స్కై బ్యాగ్స్ అందుకున్నారు. మొత్తం 174 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు గెలుపొందారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ప్రిన్సిపాల్ డి.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల లో వక్ఫ్ సవరణ రద్దు చేయాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలను ఘంటసాల మసీదు వద్ద కలసి ప్రజాశక్తి వక్ఫ్ ప్రత్యేక సంచికను ఇమామ్ అబ్దుల్ గఫార్, మత పెద్ద షేక్ బాషాకు తదితర ముస్లిం సోదరులకు అందించటం జరిగినది, వక్ఫ్ బిల్లును రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం ముస్లిలంకు వ్యతిరేకం కాదని తన నిజాయితీ నిరూపించుకోవాలని సిపిఎం పార్టీ కోరింది సీపీఎం మండల నాయకులు మేడంకి వెంకటేశ్వరావు, వాకా రామచంద్ర రావు పాల్గొన్నారు.

## నిశ్చితార్థ వేడుకల్లో ఎమ్మెల్యే కుమార్ రాజా



**పమిడిముక్కల ఏప్రిల్ 18 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని వీరంకిలాకు కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన పమిడిముక్కల గ్రామ ఉపసర్పంచ్ ఇమడబత్తిన వెంకటేశ్వర రావు కుమార్తె నిశ్చితార్థ వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సల్ ప్రింట్ సిస్టమ్స్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ప్రారంభం



**గన్నవరం, ఏప్రిల్ 18, మేజర్ న్యూస్ :** యూని వర్సల్ ప్రింట్ సిస్టమ్స్, ఉంగుటూరు మండలం, వెన్నుతల గ్రామంలో, గం టకు 80 లీటర్లు ప్యూరి ఫైడ్ సామర్థ్యం కలిగిన ఆల్కలైన్, యు వి ఫిల్టర్ టెక్నాలజి గల చలి వేంద్రాన్ని యూనివర్సల్ ప్రింట్ సిస్టమ్స్ వారి ఆధ్వర్యం లో గుడివాడ డివిజన్ విద్యుత్ శాఖ డి ఇ. జి బి శ్రీనివాస్ శుక్రవారం ప్రారం భించారు. ఈ సంధర్భంగా యూనివర్సల్ ప్రింట్ సిస్టమ్స్ యజమాని పామ ర్తి సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుతం రోజు రోజుకు ఎండ వేడిమి ఎక్కువ అవుతున్నందున మండు వేసవిలో పాదచారులకు, వాహనదారులకు దప్పిక తీర్చేందుకు తమ వంతు బాధ్యతగా ఈ చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ ఎల్ సొల్యూషన్స్, యజమాని పి జి వి దుర్గా ప్రసాద్, ఉంగుటూరు మండలం విద్యుత్ శాఖ ఎఈ. ఎ. నాగేశ్వర రా వు, పంచాయితీ విస్తరణ శాఖ అధికారి (కారంచేడు), జి వి నాగేశ్వర రావు, గ్రామస్తులు పాల్గొన్నారు. యూనివర్సల్ ప్రింట్ సిస్టమ్స్, సంస్థ త్వరలో ప్రా రంభించబడుతుందని యాజమాన్యం తెలిపింది. సంస్థ ప్రారంభమైతే యువ తకు ఉద్యోగఅవకాశాలు ఉంటాయని చుట్టుపక్కల గ్రామస్తులు హర్షం వ్యక్తపరిచారు.

## గుడ్లవల్లేరు మండలంకు 27 ఎస్సీ రుణ యూనిట్లు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ఎస్సీ కార్పొరేషన్ 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆన్లైన్ బెనిఫిషరీ మేనేజ్మెంట్ స్కీం క్రింద సబ్సిడీ లోన్స్ కొరకు ఎస్సీ వర్గాల నుంచి దరఖాస్తులు ఆహ్వాని స్తోందని ఎంపిడిఓ విజయసారధి తెలిపారు. గుడ్లవల్లేరు మండలంలో య.సి. కార్పొరేషన్ కి మొత్తం 27 యూనిట్లు కేటాయించడం జరిగిన దని, 21 నుండి 56 సం.ల మధ్య అర్హులైన ఎస్సీ అభ్యర్థులందరూ ఏప్రిల్ 14 నుండి మే 10 వతేదీలోపు దరఖాస్తులను ఆన్లైన్ చేసుకొనవలసినదిగా, సదరు దరఖాస్తులు ఆన్లైన్ చేయించుకొనుటకు మీ పరిధిలోని సచివాలయం లేదా మీ సేవ కేంద్రం వద్ద దరఖాస్తు చేసుకొనవచ్చునని ఎంపిడిఓ తెలిపారు.

## కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబంది

### 20 వాహనాలను సీజ్



**కంచికచర్ల ఏప్రిల్ 18 మేజర్ న్యూస్ :** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. ఈ నాకాబందీలో 20 వాహనాలను సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై బొనగిరి రాజు ఒకేసారి తనిఖీలు నిర్వహించారు. అక్రమ రవాణా, ప్రభుత్వ నిషేధిత పదార్థాలు రవాణా, అనుమానిత వ్యక్తుల కట్టడి నేరాల నియంత్రణే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించినట్టు ఎస్సై తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 324 వాహనాలు తనిఖీ చేశారు. అందులో 250బైక్‌లు, 50త్రీవీలర్, 24ఫోర్ వీలర్,మరియు ఇతర వాహనాలను తనిఖీ చేసినట్లు ఎస్సై తెలిపారు. వాటిలో సరైన పత్రాలు లేనందున షుమారుగా 20వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది,, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజా సేవలో మరో ముందడుగు

(మొదటిపేజీ తరువాయి)





గ్రామ స్థాయిలో నేరాలు, సమస్యాత్మక పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్చలు నిర్వహించారు.పల్లె నిద్ర కార్యక్రమం ద్వారా సమస్యాత్మక గ్రామాల్లో నిఘాను మరింత పటిష్టం చేసి, శాంతి భద్రతల పరిరక్షణకు ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. పోలీసులు ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఉన్నారని, వారి సేవలను నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు.జిల్లావ్యాప్తంగా నేర నివారణలో ప్రజలను భాగస్వాములుగా మార్చేందుకు పల్లె నిద్ర ఒక గొప్ప వేదికగా మారుతోందని అన్నారు.

## పాపవినాశనం కరకట్ట పై రోడ్డు ప్రమాదం

### ఓ వ్యక్తి మృతి, ఒకరికి గాయాలు



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఘంటసాల మండలం పాప వినాశనం కరకట్ట పై ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందగా మరొ క వ్యక్తి తీవ్ర గాయాల పాలైన సంఘటన చోటు చేసుకుంది.స్థానికుల అందించిన వరాల మేరకు ఘంటసాల మండలం గోగినేనిపాలెం గ్రామానికి చెందిన దాసి వెంకటేశ్వరరావు, గరికముక్కు శ్రీనివాసరావు బైక్ పై విజయవాడ వెళ్లి వస్తుండగా పాపవినాశనం ఆశ్రమం సమీపంలో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టారు. వెంకటేశ్వరరావు సంఘటన స్థలంలోనే మృతి చెందగా శ్రీనివాసరావు కాలు విరిగింది. స్థానికులు 108 సమాచారం అందించగా మోపిదేవి 108 ఇఎంటి సిహెచ్ వెంకట నరసయ్య, పైలెట్ దిలీప్ బాబు సంఘటన స్థలానికి చేరుకుని గాయాలు పాలైన శ్రీనివాసరావు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.కొద్ది క్షణాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వెంకటేశ్వరరావు హఠాత్తుగా మరణించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై కె. ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# విద్యా, వైద్య, ఉపాధే లక్ష్యంగా పనిచేస్తాం

## యువనాయకులు గద్దె క్రాంతికుమార్





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు పేద ప్రజల పక్షాన నిలబడుతుందని అందుకోసమే విద్యా, వైద్య, ఉ పాధికి అధిక ప్రధాన్యత ఇవ్వడం జరుగుతుందని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం గద్దె రామమోహన్ ఆదేశానుసారం 4 కుటుంబాల వారికి వైద్యం, చదువు నిమిత్తం రూ.75 వేల ఆర్థిక సహాయాన్ని గద్దె క్రాంతికుమార్ అందజేశారు. కృష్ణలంక 20వ డివిజన్కు చెందిన భూపతి హరికృష్ణ - సుజాత దంపతుల సంవత్సరంన్నర కుమార్తె చిన్నారి గ్రీష్మిక కాలుకు ఆపరేషన్. చేయించే నిమిత్తం నక్కల రోడ్లోని మిత్ర హాస్పటల్కు వెళ్ళి హాస్పటల్ వారితో మాట్లాడి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే 13వ డివిజన్ లక్ష్మీపతి నగర్ కు చెందిన అన్వర్-హసీనా కుమార్తె ఆయేషా సుల్తానాకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని జె.డి.నగర్లోని టీడీపీ కార్యాలయంలో అందజేశారు. అలాగే 8వ డివిజన్ వర్మేన్పటకు చెందిన ఎన్.వి.అక్షిత వర్మకు స్కూలు ఫీజు నిమిత్తం రూ.15 వేలు, 22వ డివిజన్ కృష్ణలంకకు చెందిన ఉదయగిరి హరినందినికి కాలేజీ ఫీజు నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాలను వారి సొంత నిధుల నుంచి గద్దె పౌండేషన్ ద్వారా గద్దె క్రాంతి కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ 2014-19 టీడీపీ ప్రభుత్వంలో పేద ప్రజల ఆరోగ్యం కోసం చంద్రబాబు నాయుడు పెద్ద ఎత్తున సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు అందించి పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. అలాగే ఫీజు రీయింబర్స్మెంట్, అంబేద్కర్ విదేశీ విద్య పేరుతో పేద కుటుంబాలకు చెందిన ఎంతోమందిని ఉన్నత విద్యకోసం విదేశాలకు పంపడం జరిగిందన్నారు. గద్దె రామమోహన్ అధికారం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా నిత్యం ఆయన సొంత నిధులతో వైద్యం కోసం, చదువులు నిమిత్తం, ఉపాధి కోసం బళ్ళు, కుట్టుమిషన్లు, రిక్షాలు అందజేస్తూనే ఉన్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో సి.ఎం.ఆర్.ఎఫ్ను నిర్వీర్యం చేశారన్నారు. మళ్ళీ కూటమి ప్రభుత్వం రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఒక్క తూర్పు నియోజకవర్గంలోనే నెలలో వందలాది ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేస్తున్నారన్నారు. కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అందించే సంక్షేమ పథకాలే కాకుండా గద్దె రామమోహన్ ఆయన సొంత నిధులతో నిత్యం ప్రజలకు ఎదొక ఆర్థిక సహాయం చేస్తూనే ముందుకు సాగుతున్నారని, ఆయన బాటలోనే గద్దె క్రాంతి సేవా కార్యక్రమాల్లో పాల్గొని పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, మోటేపల్లి చిన్నా, గద్దె ప్రసాద్, చింతా వెంకటేశ్వరరావు, ఎన్.శ్రీనివాస్, గల్ల శ్రీను, మాదిరెడ్డి రవి, అడపా శివా, పునుమోలు లక్ష్మీ, సొంఠి సాయిలక్ష్మి, గళ్లా సుబ్బారావు, నాగూర్, మానస, గుండుమోగుల రాంబాబు, కల్పన తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మంత్రి సారధి జన్మదిన వేడుకలు

### పెద్ద ఎత్తున తరలివచ్చిన టీడీపీ నాయకులు, శ్రేణులు

**గన్నవరం, ఏప్రిల్ 18, మేజర్ న్యూస్ :** రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార గౌరవ సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులను గన్నవరం విమానా శ్రయంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో విమానాశ్రయానికి విచ్చేశారు. అక్కడ టీడీపీ నాయకులు, అభిమానులు కేకులు కట్ చేసి, పూలబొకేలు అందజేసి మంత్రి పార్థసారధికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారీ గజమాలలతో సత్కరించారు. టీడీపీ నాయకులు చిట్నేని శివరామకృష్ణ, ముల్లంగి శ్రావణ్ కుమార్, ఖాదర్ భాషా, వీరబత్తిన జోషి, దొండపాటి చిట్టిబాబు, ఆగిరిపల్లి మండల పలు గ్రామాల సర్పంచ్లు ఆరేపల్లి శ్రీనివాసరావు, నక్కనబోయిన వేణు, దొండపాటి ఏసుపాదం, బెక్కం రాజ గోపాల్ తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. మంత్రి సారధి విమానాశ్రయానికి రావడంతో సందడి వాతావరణం నెలకొంది. గన్నవరం, పెనమలూరు, నూజివీడు తదితరు నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు, శ్రేణులు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## సమాజంలో కొంతమంది పాడ్ కాస్ట్ పేరుతో అసత్యాలు ప్రచారంపై ఆగ్రహం

**బీజేపీ విభజించు పాలించు విధానాన్ని వైసీపీ అమలు చేస్తుంది**

**ప్రజలు నిర్మాణాత్మక రాజకీయాలు కోరుకుంటున్నారని వెల్లడి**

**రాష్ట్ర కాంగ్రెస్ ప్రొఫెషనలస్ హెడ్ వల్లూరు భార్గవ్**



**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రస్తుత సమాజంలో కొంతమంది పాడ్ కాస్ట్ పేరుతో ప్రైవేట్ చానల్స్ సోషల్ మీడియా వేదికగా యూట్యూబ్ ఛానల్స్ స్థాపించి వాస్తవాలనుండి ప్రజలను తప్పుదోవ పట్టించడం ఫ్యాషన్ గా మారిపోయిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ప్రొఫెషనలస్ హెడ్ వల్లూరు భార్గవ్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వక్ఫ్ బోర్డు నిర్ణయాలపై కూడా సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యలు చేయడం దేశ ప్రజలందరూ గమనిస్తున్నారు అని తెలిపారు. బిజెపి విభజించు పాలించు విధానాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అమలు చేయడం దారుణం అన్నారు మతాలు కులాలు మధ్య విభేదాలు తీసుకురావడానికి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన గోసాలను వేదికగా చేసుకోవడం అన్యాయమన్నారు. ప్రజలు నిర్మాణాత్మక రాజకీయాలు కోరుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల ఫలితాల వలన రాజకీయ పార్టీలు ప్రజలు తమకు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. ఇటీవల ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసిపికి ఇచ్చిన ఫలితాల వలన బుద్ధి రావాలనన్నారు. ప్రజల తీర్పుని రాజకీయ పార్టీలు గౌరవించాలంటే నిర్మాణాత్మక రాజకీయాలు మాత్రమే చేయాలన్నారు కాంగ్రెస్ పార్టీ విధానమే ప్రజల యొక్క గొంతుక అని ఆయన స్పష్టం చేశారు.

# నేరాల నివారణకు కట్టుదిట్టమైన ప్రణాళికలు





**చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్**

**స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని వాహన తనిఖీలు నిర్వహించిన జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు,**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా పోలీస్ యంత్రాంగం జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆధ్వర్యంలో నేరాల నివారణకు కట్టుదిట్టమైన ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నాకాబంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహన పత్రాలను, లైసెన్సులను పరిశీలించి అధికారిక లైసెన్సులు లేని వాహనాలను, అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను గుర్తించడం వంటివి చేశారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వారి యొక్క వివరాలను తెలుసుకొని, వారి ఫింగర్ ప్రింట్స్ ను యంయస్ సీడీ (మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్) ద్వారా చెక్ చేసి, గత నేర చరిత్ర ఏమైనా కలిగి ఉన్నదీ, లేనిది పరిశీలించారు. ఈ నాకా బంది కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెరికేడు అండర్ పాస్ వద్ద వాహన తనిఖీ కార్యక్రమంలో పాల్గొని, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాల కట్టడికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు, అసాంఘిక కార్యకలాపాల అణచివేతకు ఈ నాకాబంది చక్కని పరిష్కార మార్గం అని అన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నివారణ, ఇసుక అక్రమ రవాణా, నాటు సారా కట్టడి ఇతర చట్ట వ్యతిరేక చర్యలను కట్టడి చేయడం తో పాటు అసాంఘిక కార్యకలాపాలను నివారించే లక్ష్యంగా ఈ నాకాబంది పటిష్ఠంగా అమలుపరుస్తున్నామన్నారు. ప్రజల రక్షణకు, నేరాల నివారణకు, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నారని, అనుమానాస్పద పరిస్థితులు తారసపడితే పోలీసు వారికి ప్రజలు సహకరించాలని కోరారు. వాటికి సంబంధించిన సమాచారం పోలీసు వారికి తెలియజేయాలని సమాచారం అందించిన వారు వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

## పామర్రులో నాకాబంది నిర్వహించిన పోలీసులు





**పామర్రు ఏప్రిల్ 18 మేజర్ న్యూస్:** పామర్రు నాలుగు రోడ్ల కూడలిలో పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, గుడివాడ డిఎస్పి వి. ధీరజ్ వినీల్ ఆదేశాల మేరకు నాకా బంది నిర్వహించినట్లు పామర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. శుభాకర్ తెలిపారు. నాకా బందిలో భాగంగా కార్లు, ఆటోల రికార్డులను పరిశీలించారు. సిఐ శుభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొని వాహనాలను తనిఖీ చేశారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు **ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999